సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 13 | జూన్ | 2025



కాళేశ్వరంలో ట్రైయినీ కలెక్టర్లు

కాళేశ్వరం ప్రాజెక్టును ట్రైయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయానమావి తదితరుల బృందం సందర్శించింది. - 8లో▸



రెండు గంటలు.. 30 మంది అధికారులు

సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది సభ్యులు కాజీ పేట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34^{0} / 26^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా 5కే రన్



ఎంజీఎం : నేషనల్ సర్జన్స్ డేను పురస్కరించుకొని ఏఎస్ఐ వరంగల్ బ్రాంచ్ ఐఎంఏ వరంగల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్జరీ, కేఎంసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన గురువారం కేఎంసీ నుంచి ఐఎంఏ హాల్ వరకు 5కే రన్ నిర్వహించారు. ఏఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌దాస్, ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ ఈ రన్ ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కాకుండా సర్జన్‌ల పాత్రను సమాజానికి వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్జన్ డాక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, నాగేందర్, విద్యాసాగర్, రూప, కార్తీక్, కేఎంసీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, పీజీ, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సెర్ప్ ఏపీడీగా వెంకటేశ్వర్లు



హన్మకొండ అర్బన్ : హనుమకొండ డీఆర్‌డీఏ పరిధి సెర్ప్ అదనపు డైరెక్టర్‌గా బొజ్జ వెంకటేశ్వర్లును నియమిస్తూ ఆ సంస్థ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్డీఏ ఆధ్వర్యాన చేపట్టిన సాధారణ బదిలీల్లో ట్రాన్స్‌ఫర్ చేశారు. గతంలో వెంకటేశ్వర్లు జిల్లాలో డీపీఎంగా కొంతకాలం పనిచేశారు.

కేయూలో నేటినుంచి జాతీయ వర్క్‌షాప్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ఆధ్వర్యాన ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి ఆచార్య జి.షమిత తెలిపారు. 'హ్యాండ్ ఆన్ మాలిక్యూలర్ డాకింగ్ అండ్ డ్రగ్ డిస్కవరీ టెక్నిక్స్' అనే అంశంపై జువాలజీ సెమినార్ హాల్‌లో నిర్వహించే ఈ వర్క్‌షాప్ ప్రారంభం సమావేశంలో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డితోపాటు సైన్స్ డీన్ జి.హనుమంతు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడాల ఇస్తారి, కన్వీనర్ వై.వెంకయ్య, బీఓఎస్ ఈసం నారాయణ పాల్గొంటారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్



రామన్నపేట : విద్యార్థులు, అధ్యాపకుల సమష్టి కృషితో టీజీఈసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ అన్నారు. టీజీఈసెట్-2025లో ఉత్తమ ప్రతిభ కబర్చి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను గురువారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించడం కళాశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ స్ఫూర్తిదాయక ప్రదర్శన ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. భవిష్యత్‌లో వారు మరిన్ని విజయాలు సాధించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ దర్శనం విజయభాను తెలిపారు. వరంగల్-1 డిపో సూపర్ లగ్జరీ బస్(సర్వీస్ నంబర్ 92222) ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి 28న ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుంది. విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధికి చేరుకుంటుందన్నారు. ఇక్కడ దర్శనం అనంతరం సాయంత్రం 7 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని ఒక ప్రకటనలో వివరించారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 29న మధ్యాహ్నం బయలుదేరి 30న ఉదయం శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం, తర్వాత బీచుపల్లి హనుమాన్ దర్శనం అనంతరం హనుమకొండకు బయలుదేరుతుందన్నారు. ఈ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.5,000, పిల్లలకు రూ.3,500 నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, పూర్తి సమాచారానికి 9063407493, 7780565971, 9866373825, 9959226047 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్కూళ్ల పునఃప్రారంభం రోజు హనుమకొండలోని మర్కజీ పాఠశాలకు సంతోషంగా వస్తున్న విద్యార్థులు







బడిగంట కొడుతున్న ఆయమ్మ





చోర్.. చోర్

కమిషనరేట్‌లో వరుస దొంగతనాలు

- ఒక్కో పోలీస్ స్టేషన్‌లో పదుల సంఖ్యలో కేసులు పెండింగ్
- స్టేషన్ల చుట్టూ తిరిగి విసిగి పోతున్న బాధితులు
- కనిపించని పోలీస్ పెట్రోలింగ్.
- సమీక్షలకే అధికారులు పరిమితం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ట్రైసిటీల్లో ఎక్కడ ఎప్పుడు దొంగతనం జరుగుతుందో.. ఎంత నష్టపోవాల్సి వస్తుందో ఎవ్వరికీ అంతుపట్టడం లేదు. కమిషనరేట్ పరిధిలో అంతర్రాష్ట్ర దొంగలతోపాటు స్థానిక దొంగలు రెచ్చిపోయి చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు కేసులు నమోదు చేసి, ఒకటి రెండు రోజులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి విసిగిపోతున్నారు. కమిషనరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఒక్క హన్మకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఈ ఏడాది ఇప్పటి వరకు 35 చోరీలు జరిగాయంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో చోరీలు రాత్రి పూట ఎక్కువగా జరిగేవి. అయితే ఇటీవల రాత్రి, పగలు తేడా లేకుండా దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులు కేవలం పండుగల సమయంలోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మిగితా సమయంలో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో రూ.కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఇంకా రికవరీ కాలేదు.

జాడలేని పెట్రోలింగ్

ఒకపక్క జోరుగా చోరీలు జరుగుతుంటే మరో పక్క పోలీస్ పెట్రోలింగ్ జాడ లేకుండా పోయిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పోలీస్ ఉన్నత అధికారులు ప్రతీ సమీక్ష సమావేశంలో విజుబుల్ పోలీసింగ్ పెంచాలని కింది స్థాయి అధికారులకు పదే పదే చెబుతున్నా.. చాల మంది అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అధికారుల ఆదేశాలను అలా విని ఇలా వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. రాత్రి సమయంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ వాహనాలు తిరగడం లేదు. స్థానిక దొంగలు ఇలాంటి విషయాలను పసిగట్టి ఆ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. దొంగతనం జరిగిన తర్వాత పోలీసులు అప్రమత్తమై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో ఫలితం లేకుండా పోతోంది. పోలీస్ ఉన్నతాధికారులు కేవలం సమీక్షలకే పరిమితం అవ్వడం వల్లే క్షేత్ర స్థాయిలో అధికారులు దొంగలను పట్టుకోవడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కమిషనరేట్ పరిధిలో చోరీలు ఇలా..

- ఈ ఏడాది జనవరి 21న హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరుజెండా, సుభాష్‌కాలనీలో తాలం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడి 178 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇదే నెలలో కొత్తూరుజెండాలో రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాల చోరీ జరిగింది. ఇదే పోలీస్‌స్టేషన్ పరిధి కాకాజీ కాలనీలోని ఓ ఆస్పత్రిలో ఏప్రిల్ 8న బ్యాగులో బంగారం పెట్టి స్కానింగ్‌కు వెళ్లి వచ్చేసరికి బ్యాగు అపహరణకు గురైంది. అందులో 7 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి.
- ఏప్రిల్ 5న హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి నయీంనగర్‌లో 5 తులాల బంగారం, రూ.50 వేల నగదు దొంగతనం జరిగింది.
- మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి బొల్లికుంట, సింగారంలో ఏప్రిల్‌లో రూ.15 లక్షల నగదు, రూ.2.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి.
- మే నెలలో ఖానాపూర్ మండల కేంద్రంలో చోరీ జరిగి రూ.10 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు పోయాయి. అలాగే.. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి కృష్ణాకాలనీలో రూ.10 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి వెంకటేశ్వర కాలనీలో రూ.17 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి.
- ఈనెల 8న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి పడమర కోటలో జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు తన ప్రేయసిని సంతోష పెట్టడానికి తన ఇంట్లోనే చోరీ చేసి 16 తులాల బంగారం ఎత్తుకుపోయి పోలీసులకు చిక్కిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదే పోలీస్‌స్టేషన్ పరిధి గణేశ్‌నగర్‌లో ఈనెల 11న చోరీ జరిగి 7 తులాల బంగారం, 70 తులాల వెండి ఆభరణాలు పోయాయి.

అధికారులు దృష్టిసారించేనా..?

కమిషనరేట్ పరిధిలో చోరీలతో పాటు చైన్‌స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాలు పదుల సంఖ్యలో పోతున్నాయి. అధికారులు రికవరీ మాత్రం నామమాత్రంగా చూపిస్తున్నారు. ద్విచక్ర వాహనాలను పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేన్ల చుట్టూ తిరుగుతున్నా అధికారులు కేసులు నమోదు చేయడం లేదు. వెతుకుతున్నాం.. దొరికితే అప్పగిస్తాం.. కేసులు పెడితే కోర్టు నుంచి రికవరీ చేసుకోవాల్సి ఉంటుందని భయపెట్టి కేసుల నమోదులో జాప్యం చేస్తున్నారు. నెలల తరబడి తిరిగినా కేసులు నమోదు చేయకపోవడంతో బాధితులు వారి బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మధ్యలోనే వదిలేస్తున్నారు. నగరంలోని చాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎన్ని చోరీలు జరిగినా వాటి రికవరీ విషయంలో అధికారులు శ్రద్ధ పెట్టడం లేదనే విషయం ఉన్నత అధికారుల సమీక్షల్లో వెల్లడయినా చర్యలు లేకపోవడంతో రికవరీ ఎక్కడ వెసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

ఆన్‌లైన్ జీరో పర్మిట్ అమలుచేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ పనులకు సంబంధించి చిన్న తరహా ఖనిజాలైన కంకర, మట్టి కోసం ఆన్‌లైన్ జీరో పర్మిట్ అమలు చేయాలి.. ఈ విధానంపై కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో మైనింగ్, టీజీఎండీసీ, రెవెన్యూ, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులు ప్రభుత్వ పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు ఆన్‌లైన్ జీరో పర్మిట్‌కు దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఆమోదించడం వల్ల అక్రమ ఖనిజ రవాణాను అరికట్టవచ్చని చెప్పారు. వాగుల్లో ఇసుక వెలికితీత, అక్రమ రవాణాపై పరిపాలనా పరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అవసరం ఎంతో ఉందని, సాండ్ బజార్ ద్వారా ఆన్‌లైన్ తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ధర్మసాగర్, హసన్‌పర్తి, ఆత్మకూరు మండలాల్లో సాండ్ బజార్ కోసం ఐదు ఎకరాల చొప్పున స్థలం గుర్తించాలని, శుక్రవారం నుంచి లబ్ధిదారులకు కూపన్లు ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, డాక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'భోజన' పథకం పక్కాగా అమలుచేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, డీఆర్డీఓ, వైద్య ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన స్టీరింగ్, మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 470 పాఠశాలలు ఉండగా 324 స్కూళ్లకు వంట గదిలు అందుబాటులో ఉన్నాయని, మిగతా వాటికి నిర్మించాల్సి ఉందని, ప్రతిపాదనలు త్వరగా పంపించాలని డీఆర్డీఓ మేన శ్రీనును ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో అవసరమైన వంట సామగ్రికి రూ.50 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. వంట కార్మికులకు కనీసం మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అన్ని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చి సిలిండర్లు సరఫరా చేయాలని తెలిపారు. మూడు నెలలకోసారి ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలను నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ వాసంతి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో సిద్ధంగా ఉండాలి

హన్మకొండ: విపత్తు, ప్రమాదాలు వంటి ఆపద సమయాల్లో సహాయం అందించేందుకు ఆపద మిత్రలు సిద్ధంగా ఉండాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థల ఆదేశాల మేరకు జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన ఆపద మిత్రలకు హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో అనుకోని ప్రమాదాలు జరిగినా.. విపత్తులు సంభవించినా వెంటనే అధికారులకు సమాచారం అందించడంతో పాటు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రకృతి విపత్తులు, ఆపద సమయాల్లో కాపాడటం, సహాయం చేయడంపై శిక్షణలో నేర్చుకున్న అంశాలను పదిమందికి నేర్పించాలని పేర్కొన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు మాట్లాడుతూ మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో 126 మంది, పరకాలలో 131 మంది వలంటీర్లకు 12 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆపద మిత్ర వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ జయశ్రీ, సైకాలజిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు



మాట్లాడుతున్న న్యాయమూర్తి పట్టాభిరామారావు

విద్యారణ్యపురి: బాలలను పనిలో పెట్టుకోవద్దు.. వారితో పనిచేయించుకునేవారు చట్టపరంగా శిక్షార్హులవుతారని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభిరామారావు అన్నారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన హనుమకొండలోని జెడ్పీహాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల వయసు వరకు బాలకార్మికులే.. ఆ వయసు వారు పనుల్లో కనబడితే దగ్గరలోని సామాజిక సహాయ సంస్థలకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో హనుమకొండ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి క్షమా దేశ్‌పాండె, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.రాము, గవర్నమెంట్ ప్లీడర్ కె.నర్సింహారావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నారాయణ స్వామి, డీడబ్ల్యూఓ జయంతి, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి, ఎఫ్ఎంఎం ఎన్‌జీఓ డైరెక్టర్ సహాయసిస్టర్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ పి.ఫిలిప్‌రాజ్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

వరంగల్ క్రైం: ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. చిన్న కేసులతో కక్ష పెంచుకుని కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, రాజీపడదగిన కేసుల్లో ఇరు వర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారని, రాజీపడాలని అనుకునే వారు పోలీస్ అధికారులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు గ్రాండ్ వెల్‌కమ్

పునఃప్రారంభమైన పాఠశాలలు

- మామిడి తోరణాలతో అలంకరణ
- విద్యార్థులకు పూలతో స్వాగతం
- తొలిరోజు 30శాతం వరకే విద్యార్థుల హాజరు



హనుమకొండ జిల్లా పీచర జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పూలు అందజేసి ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు గురువారం బడిబాట పట్టారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పండుగ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. వివిధ చోట్ల స్కూళ్లను మామిడి తోరణాలు, పూలు, బెలూన్లతో అలంకరించి పిల్లలకు తొలిరోజే గొప్ప అనుభూతి కలిగేలా ఆహ్వానం పలికారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలు అందజేసి స్వాగతించారు. 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశాలు కూడా నిర్వహించారు. కొందరు తమపిల్లలతోపాటు పాఠశాలలకు వచ్చారు. వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన చిన్నారులు మారాం చేస్తుండగా బుజ్జగించడం కనిపించింది.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్

హనుమకొండ జిల్లాలో 477, వరంగల్ జిల్లాలో 558 పాఠశాలల్లో తొలిరోజు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందజేశారు. హనుమకొండ పోచంపల్లి పాఠశాలలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావిణ్య, డీఈఓ వాసంతి, కమలాపూర్ భీంపెల్లిలో జెడ్పీసీఈఓ విద్యాలత, ఎలకతుర్తి మండలం వల్బాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి జెడ్పీహెచ్ఎస్, పల్లారిగూడెం యూపీఎస్‌లను జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ కె.సుభాష్ సందర్శించారు. వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ పాఠశాలలో 300ల మంది విద్యార్థులకు 150 మంది, హనుమకొండ పోచంపెల్లి పాఠశాలలో 180 మందికి 100 మంది హాజరయ్యారు. వరంగల్ జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ పలు పాఠశాలలను సందర్శించి పర్యవేక్షించారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా మోదీ పాలన

- 11 ఏళ్లలో ఒక్క అవినీతి ఆరోపణ లేదు
- అన్ని రంగాల అభివృద్ధిలో దేశం పరుగులు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే.అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

హన్మకొండ: సేవా, సుపరిపాలన, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలన సాగుతున్నదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె.అరుణ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ లేదని, ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో అభివృద్ధి, సంక్షేమానికి, సుపరిపాలన, దేశ భద్రతకు, అలాగే రోడ్లు, రైల్వే, విద్య, వైద్యం, ఉపాధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఎంటీఎస్ విస్తరణకు సహకరించకపోతే కేంద్ర ప్రభుత్వం నిధులతో యాదగిరి గుట్ట వరకు రూ.400 కోట్లతో విస్తరిస్తున్నట్లు తెలిపారు. మామునూర్ విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నామని, రూ.500 కోట్లతో వరంగల్‌లో టెక్స్‌టైల్స్ పార్కు, గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం ద్వారా పేదలకు సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించామని, ఒక్కరికి నెలకు ఉచితంగా 5 కిలోల బియ్యం కేంద్రం ఇస్తున్నదని, మహిళలకు ముద్ర రుణాలు రూ.20 లక్షల వరకు పెంచినట్లు వివరించారు. అంతకు ముందు మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్, నాయకులు చొల్లేటి కృష్ణమాచారి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, దొంతి దేవేందర్ రెడ్డి, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, గుజ్జ సత్యనారాయణ రావు, రావుల కిషన్, బైరి లక్ష్మి, రావుల కోమల, చాడ స్వాతి, గుజ్జుల వసంత, గొట్టి కొప్పుల రాంబాబు, కందగట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టర్‌గా స్నేహ శబరీష్

- సంగారెడ్డి కలెక్టర్‌గా ప్రావీణ్య బదిలీ
- బల్దియా కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్
- అశ్విని తానాజీ వాకడేపై బదిలీ వేటు..
- కరీంనగర్ అడిషనల్ కలెక్టర్‌గా నియామకం



హనుమకొండ కొత్త కలెక్టర్ స్నేహ శబరీష్



బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్





బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

సాక్షిప్రతినిధి, వరంగల్ : హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సంగారెడ్డి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న స్నేహ శబరీష్‌ను కలెక్టర్‌గా నియమించారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె గతంలో కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. స్నేహ శబరీష్ ములుగు జిల్లా ఎస్పీగా పని చేస్తున్న శబరీష్ సతీమణి. గురువారం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇక్కడి నుంచి బదిలీ అయిన 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన పి.ప్రావీణ్య 2019-20లో కరీంనగర్ ట్రైయినీ కలెక్టర్‌గా, కొద్ది రోజులు జీహెచ్ఎంసీలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2021 సెప్టెంబర్ 3 నుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2023లో వరంగల్ కలెక్టర్‌గా ఉన్న గోపి బదిలీ అయిన నేపథ్యంలో ఆయన స్థానంలో అదే ఏడాది మార్చి 13న ప్రావీణ్య నియమితులయ్యారు. కాగా హనుమకొండ కలెక్టర్‌గా ఉన్న సిక్తా పట్నాయక్ 2024 జూన్ 16న బదిలీ కాగా.. ఆమె స్థానంలో వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్యను నియమించిన ప్రభుత్వం.. వరంగల్ కలెక్టర్‌గా సత్య శారదను నియామకం చేశారు. సుమారు ఏడాదిగా హనుమకొండ కలెక్టర్‌గా పనిచేసిన ప్రావీణ్య అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసి ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు.

బల్దియా కమిషనర్‌పై బదిలీ వేటు..

ఇదిలా ఉండగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేపై బదిలీ వేటు పడింది. ఆమె స్థానంలో 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన చాహత్ బాచ్‌పాయ్‌ని నియమించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అశ్విని తానాజీ వాకడేను 2023లో వరంగల్ అడిషనల్ కలెక్టర్ నుంచి బదిలీ చేసి వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. బల్దియా అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపుల విషయంలో జాప్యం చేయడం తదితర ఆరోపణలు ఎదుర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీ, స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి, అక్రమాలు, టెండర్లు లేకుండా పనుల కేటాయింపు, బిల్లుల చెల్లింపుల్లో పర్సెంటేజీలు తదితర విషయాల్లో కీలక ప్రజాప్రతినిధికి వంతపాడారన్న ఆరోపణల నేపథ్యంలో ఆమెను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్‌గా నియమించారన్న ప్రచారం జరుగుతోంది. కాగా ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన చాహత్ బాచ్‌పాయ్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సతీమణి.

వీధి వ్యాపారులకు 'స్వనిధి సే సమృద్ధి' : కమిషనర్

వరంగల్ అర్బన్ : వీధి వ్యాపారుల సౌలభ్యం కోసం 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కాజీపేట కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్‌లో గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈనెల 9-14 వరకు 'స్వనిధి సే సమృద్ధి' క్యాంపులు ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వీధి వ్యాపారులకు అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ విజయశ్రీ, రజాఅలీ, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, డీఎంసీ రజితారాణి, ఏడీఎంసీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాను పరిశీలించిన 'కుడా' చైర్మన్



కలెక్టర్ బంగ్లాలో పనుల పురోగతిని పరిశీలిస్తున్న కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్ : హనుమకొండ కలెక్టర్ పాత బంగ్లాలో చేపట్టిన పనుల పురోగతిని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం కాలం నాటి చారిత్రక భవనమైన హనుమకొండ కలెక్టర్ బంగ్లాను ఓరుగల్లుకు ఐకాన్‌గా, హెరిటేజ్ భవనంగా మార్చి చరిత్రలో నిలిచేలా అభివృద్ధి చేసి సందర్శకులకు ఆకర్షణీయ కేంద్రంగా మార్చే దిశగా పనులు జరుగుతున్నాయని చెప్పారు.

7 నుంచి కరీంనగర్, తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్

ఖిలా వరంగల్: జూలై 7వ తేదీ నుంచి కరీంనగర్– తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్ నడుపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8న తిరుపతి– కరీంనగర్ వీక్లి వన్స్ ట్రైన్ నడవనుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

20 వరకు ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ రెండో సెమిస్టర్ విద్యార్థులు పరీక్షల ఫీజు చెల్లించేందుకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) గడువు ఈనెల 20 వరకు ఉన్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు తొలగించారని..

ధర్మసాగర్: గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఓ యువకుడు బుధవారం గదిలో ఉంచి తాళం వేసి నిర్బంధించిన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం రాపాకపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఇటీవల ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కందుకూరి ప్రశాంత్ అనే యువకుడి పేరు వచ్చింది. ప్రొసీడింగ్ ఇచ్చే సమయంలో అతడి పేరు లేదు. తన పేరు ఎలా తొలగిస్తారంటూ ప్రశాంత్ బుధవారం మధ్యాహ్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి భోగి శ్రీనివాస్‌ను ఆఫీస్ గదిలో ఉంచి తాళం వేసి దూషించాడు. దీంతో అతను పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు చేరుకుని ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మండలంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, కార్యదర్శులు కూడా అనర్హుల పేర్లనే ఫైనల్ చేశారని ప్రజలు ఆరోపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రెండు గంటలు.. 30 మంది అధికారులు

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ బృందం తనిఖీలు

- ప్రత్యేక స్పీక్ రైలులో కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్టర్న్ రైల్వే బృందం



రైల్వే రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ సిస్టంలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

కాజీపేట రూరల్ : సౌత్ వెస్టర్న్ ఇంటర్ రైల్వే సేఫ్టీ ఆడిట్ అధికారుల బృందం గురువారం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. రైల్వే గేట్లు, వంతెనలు, సిగ్నల్ పాయింట్లు, ట్రాక్‌ను తనిఖీ చేసుకుంటూ కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్టర్న్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృంద సభ్యులకు కాజీపేట రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సౌత్ వెస్టర్న్ రైల్వే హుబ్లీ ప్రిన్సిపాల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రామకృష్ణ నేతృత్వంలో సౌత్ వెస్టర్న్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, కాజీపేట అధికారులు రైల్వే సీఆర్‌ఎస్‌ఈ వి.ఎం.దాస్‌పుత్ర, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ రవీంద్రనాథ్, సీటీపీఎఫ్ దినేశ్, సీనియర్ డీఎస్‌ఓ సురేశ్, సీఈఎల్‌ఈ, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియ అగర్వాల్, డీఓఎం జనరల్ సుధీర్‌కుమార్, కాజీపేట డీజిల్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, కాజీపేట ఈఎల్‌ఎస్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఇతర అధికారులు బృందం వివిధ డిపార్ట్‌మెంట్లలో తనిఖీలు నిర్వహించారు. కాజీపేట రైల్వే స్టేషన్, 140 టన్నుల క్రేన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, మెడికల్ రిలీఫ్ వ్యాన్ ట్రైన్, క్యారియజ్ అండ్ వ్యాగన్ డిపో, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపో, లోకోపైలెట్ కార్యాలయం, రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం, రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, రైల్వే ఇంజనీరింగ్ డిపో, సిగ్నల్ వ్యవస్థ, పాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన విషయాలపై ఆరా తీసి నోట్ చేసుకున్నారు. గతంలో పలు చోట్ల జరిగిన రైలు ప్రమాదాలను గుర్తు చేస్తూ అలా జరగకుండా సేఫ్టీ నియమాలు పాటించాలని సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నం 3.09 గంటలకు చేరుకున్న అధికారుల బృందం.. రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సాయంత్రం 5.20 గంటలకు కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. అధికారుల బృందం తనిఖీల్లో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్‌తోపాటు అన్ని విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు పోటీచేస్తాం

- మహిళగా నన్ను అవమానించారు
- ఫోన్‌ట్యాపింగ్, స్త్రీనిధి, పీఆర్ అవినీతిలో జైలుకు ఖాయం
- దయాకర్‌రావుపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి ఫైర్



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

హన్మకొండ చౌరస్తా: వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా నాటి యతిరాజారావు నుంచి మొన్నటి దయాకర్‌రావు వరకు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉంటున్నాం.. అంతకుముందు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని జంగా రాఘవరెడ్డి తమను కోరాగా.. పార్టీలతో సంబంధం లేకుండా దయాకర్‌రావుకు సపోర్ట్ చేశామన్నారు.

అవమానాలు భరించలేకే రాజకీయాల్లోకి..

దయాకర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం సొంత ఖర్చుతో స్థలం కొనుగోలు చేసి ఇచ్చాం. స్థలం ఇచ్చే ముందు నా భర్త పేరుపెడతామని చెప్పి చేయలేదు. అప్పటి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు శానిటేషన్ ప్యాడ్స్ పంపిణీ నిలిపివేస్తే, మా సంస్థ ఆధ్వర్యాన ఇవ్వడానికి ముందుకొచ్చాం. ఆ కార్యక్రమానికి దయాకర్‌రావు రాలేదు. కలెక్టర్, స్కూల్ ఉపాధ్యాయులను సైతం రానివ్వకుండా చేశాడు. మేము చేసే అనేక కార్యక్రమాలను అడ్డుకుంటూ నన్ను అవమానించాడు. అమెరికా వెళ్లాక ఏనాడు రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. దయాకర్‌రావు చేసిన అవమానాలను తట్టుకోలేకే రావాల్సి వచ్చింది. మంత్రిగా దయాకర్‌రావు నా ఫోన్‌ను సైతం ట్యాపింగ్ చేయించారు. ఫోన్ ట్యాపింగ్, స్త్రీనిధి నిధుల గోల్‌మాల్, పంచాయతీ రాజ్ నిధుల్లో అక్రమాలు ఇలా అనేక విషయాల్లో ఆయన జైలుకు పోవడం ఖాయమన్నారు.

విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలను గురువారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిరంతరం విధుల్లో ఉంటూ ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడా పోటీలతో మానసిక, శారీరక విశ్రాంతి లభిస్తుందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే వారందరం అన్నదమ్ములమే.. పోటీల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్(ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో) ఆధ్వర్యాన ఈనెల 14 వరకు జరిగే ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని, కబడ్డీ 12 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్ 9 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, హనుమకొండ ఎస్‌ఈ పి.మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ ఎ.విజయేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కోశాధికారి ఎం.సంతోష్, కౌన్సిల్ సభ్యులు యాకూబ్‌పాషా, సునీల్ కుమార్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రైయినీ కలెక్టర్లు



ట్రైయినీ కలెక్టర్లకు మేడిగడ్డ బ్యారేజీ గురించి వివరిస్తున్న ఇరిగేషన్ డీఈ సురేశ్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ట్రైయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయాన మావి, కొయ్యాడ ప్రణయ్ కుమార్ బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కన్నెపల్లిలోని లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించింది. పంపుహౌస్ వివరాలను ఇరిగేషన్ డీఈ సత్యబాబు వివరించారు. విద్యుత్ వినియోగం, ఎత్తిపోతల వివరాలు, స్టోరేజీ, మోటార్ల సామర్థ్యం, సాగు, తాగు అవసరాల వినియోగంపై వివరించారు. అనంతరం ట్రైయినీ కలెక్టర్ల బృందం మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీని సందర్శించింది. మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, లైసన్ అధికారి అబ్బాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్, డీఈ సురేశ్ తదితరులు ఉన్నారు. కాగా, ట్రైయినీ కలెక్టర్ సౌరభశర్మ శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల పునఃప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పోటీపరీక్షల ద్వారానే నియమితులవుతారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే సర్కారు బడులు జ్ఞానకర్మాగారాలుగా మారుతాయన్నారు.ఉపాధాయులు నిత్యవిద్యార్థిగా ఉంటూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, కృత్రిమ మేధతో తరగతి గదుల అనుసంధానం డిజిటల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారని విద్యాబోధన పద్ధతుల్లో నవీనప్రక్రియలను చేపడుతోందన్నారు. ఈవిద్యాసంవత్సరంలో 135 పాఠశాలల్లో కృత్రిమ మేధ తరగతులను,16 పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. డీఈఓ డి. వాసంతి మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ బి. మనోజ్‌కుమార్, ఆ పాఠశాల హెచ్‌ఎం జి. ఉప్పలయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం బి. రాధ, పర్యావరణ పరిరక్షణ సమితి బాధ్యులు, రిటైర్డ్ డీఎఫ్‌ఓ కాజీపేట పురుషోత్తం, అశోక్‌బాబు, ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల అభివృద్ధిలో భాగస్వాములుకావాలి

- జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: సర్కారు స్కూళ్ల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి కోరారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం ఉపాధ్యాయుల బాధ్యత అని, అలాగే పాఠశాలల ఆస్తిత్వాన్ని కాపాడే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ప్రతి నెల మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశాలు జరుగుతాయని, తప్పనిసరిగా హాజరై తమ పిల్లల చదువు, పాఠశాలల అవసరాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం జి.వి. రామారావు, తెలుగు స్కూల్ అసిస్టెంట్ వల్స పైడి తదితరులు పాల్గొన్నారు.

సునీల్ కుటుంబానికి అండగా ఉంటా..

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సునీల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్నమంత్రి

ములుగు రూరల్ : అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన సాక్షి ములుగు ఆర్‌సీ ఇన్‌చార్జ్ భూక్య సునీల్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు గురువారం సునీల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా సునీల్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సునీల్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడంతోపాటు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మ న్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, నల్లెల భరత్ కుమార్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీస్‌లు త్వరగా మంజూరు చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో వ్యవసాయ సర్వీస్‌లను త్వరితగతిన మంజూరు చేయాలని ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ లింకింగ్ లైన్లు 68 పూర్తి అయ్యాయని, ఈ నెలాఖరు వరకు మిగతా 97 పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ కాకుండా నిర్వహణ చేపట్టాలని, పిడుగుల నిరోధకం అమర్చాలని సూచించారు. పురోగతిలో ఉన్న కొత్త సబ్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణాల్లో అవసరమైన చోట 8 ఎంవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డి.ఈలు అనిల్ కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

వికసిత్ భారత్ దిశగా అడుగులు

- బీజేపీ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య



ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రమాదేవి, ఎమ్మెల్సీ కొమురయ్య

ఖిలా వరంగల్: వికసిత్ భారత్ దిశగా దేశం అడుగులు వేస్తోందని బీజేపీ ఎమ్మెల్సీ కొమురయ్య, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవి అన్నారు. బీజేపీ 11 ఏళ్ల సుపరిపాలనపై వరంగల్ చౌరస్తాలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గురువారం సంబురాలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. నరేంద్ర మోదీ అభివృద్ధి ఫలాలు, సాధించిన ఆర్థిక ప్రగతిని ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే నినాదంతో నడుస్తున్న ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేశం పురోగమిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, అరూరి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం, సతీష్‌షా, నాయకులు పుల్లారావు, బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, రాణా ప్రతాప్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, గజ్జెల శ్రీరాములు, ముంద్రాతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసులను నమ్మించి నిందితుడి పరారీ

- వరంగల్ ఎంజీఎంలో ఘటన

కాజీపేట: ఓ నిందితుడు ఎస్కార్ట్‌గా వచ్చిన పోలీసులను నమ్మించి సమయం చిక్కగానే పరారైన ఘటన ఎంజీఎం వద్ద జరిగింది. కాజీపేట మండలం కడిపికొండకు చెందిన యువకుడు కస్తూరి సాయి కుమార్ ఇటీవలి పట్టణంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. సాయికుమార్ సమాచారం ఆధారంగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చడం కోసం వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎం తరలించగా పోలీసులు ఏమరుపాటుగా ఉన్న సమయంలో పరారయ్యాడు. ఎస్కార్ట్ పోలీసులు అప్రమత్తమై వెంటపడినప్పటికీ నిందితుడు వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కి ఉడాయించాడు. పోలీసులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

కాళేశ్వరం: కాళేశ్వరంలోని గోదావరి నదిలో పుణ్యస్నానానికి వచ్చిన ఓ వ్యక్తి.. నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కాశీంపల్లికి చెందిన నల్లపూరి రమేశ్(58) కాళేశ్వరం వెళ్లి గోదావరి నదిలో పుణ్యస్నానం చేసి వస్తానని చెప్పి ఈనెల 10న ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే గురువారం ఉదయం గోదావరిలో ఓ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు..

ఖిలా వరంగల్: రైలు నుంచి జారి పడి ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం ఎల్గూరు రైల్వేస్టేషన్ సిగ్నల్ వద్ద చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె.భాస్కర్ కథనం ప్రకారం.. ఎల్గూరు రైల్వే స్టేషన్ హోమ్ సిగ్నల్ వద్ద గుర్తుతెలియని రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంట్, బ్రౌన్ కలర్ ఫుల్ షర్ట్ ధరించాడు. వీపుపై పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామని, ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే 9440361941, 8712658585 ఫోన్ నంబర్ల సంప్రదించాలని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా కమిటీ ఏర్పాటు

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు



సమావేశంలో అసోసియేషన్ నాయకులు

హన్మకొండ: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కమిటీ నియామకం చెల్లదని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రెసిడెంట్ ఆరెపల్లి శ్రీనివాస్, సెక్రటరీ బక్క దానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఉపేందర్, ఇతర నాయకులు స్పష్టం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్ వాట్సాప్ గ్రూప్‌లో ఎన్పీడీసీఎల్ శాఖ కొత్త కమిటీ ఏర్పాటు చేసినట్లు పోస్టులు చేస్తున్నారని, దీనిని అసోసియేషన్ సభ్యులు పరిగణనలోకి తీసుకోవద్దని వారు సూచించారు. గురువారం హనుమకొండలో అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ సమావేశం జరిగింది. ఇందులో మాతంగి శ్రీనివాస్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఎన్నికలు నిర్వహించకుండా, అసోసియేషన్ సభ్యులతో చర్చించకుండా కమిటీని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. త్వరలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించే వరకు పాత కమిటీనే కొనసాగుతుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామస్వామి, రౌతు రమేశ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ దామెర స్వదేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



సూచనలు చేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట/ఖిలా వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్ట్ రోడ్ల కనెక్టివిటీ కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గురువారం ఆమె పర్యటించారు. రోడ్ల నిర్మాణం చేపట్టే ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరుపల్లి నుంచి నేషనల్‌హైవే వరకు, నక్కలపల్లి నుంచి గాడిపల్లి–గాడిపల్లి బైపాస్ వరకు రోడ్ల స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి పంపడానికి త్వరితగతిన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారి రమేశ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు త్వరితగతిన పరిహారం..

న్యూశాయంపేట: ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములిచ్చిన భూనిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రాజీవ్ మెగా టౌన్‌షిప్ లేఔట్ అనుమతుల పురోగతి తదితర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెకుంట, ఏనుమాములతోపాటు ఖిలా వరంగల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులకు త్వరితగతిన పరిహారాన్ని చెల్లించాలన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో రాజీవ్ మెగా టౌన్‌షిప్ ఏర్పాటుకు లేఔట్ అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కేఎంటీపీ జోనల్ మేనేజర్ స్వామి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, కుడా పీఓ అజిత్‌రెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, మహ్మద్ ఇక్బాల్, రియాజుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి..

ఖిలా వరంగల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. ఖిలా వరంగల్ మండల పరిధి గుంటూరుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ సత్యశారద, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. ఈనెల 6వ తేదీ నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పునఃప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించి తిరిగి బడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అంతకుముందు నూతనంగా బడిలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఓ రమేష్, ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.